క్లుప్తంగా

మెదక్ తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు



తొగుటలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తొగుట(దుబ్బాక): మెదక్ పట్టణంలో నిర్వహిస్తున్న బీజేపీ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశానికి మండల నాయకులు గురువారం తరలివెళ్లారు. చందాపూర్ మాజీ సర్పంచ్ నర్సింహులు యాదవ్ ఆధ్వర్యంలో ముఖ్యనాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు విజయం ఖాయమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చారన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేయని కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, వివిధ గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

యువగర్జనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు మహేష్ రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన దుబ్బాక నియోజకవర్గం దౌల్తాబాద్‌లో జరిగే విద్యార్థి యువజన గర్జన, సోషల్ మీడియా సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు తీపిరెడ్డి మహేష్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. యువగర్జనకు విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో విచ్చేసి బీఆర్ఎస్ సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ అహ్మద్, యూత్ మండల అధ్యక్షుడు చార్వాక కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ వార్ రూమ్ కోఆర్డినేటర్‌గా రాహుల్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో రాహుల్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పీసీసీ వార్ రూమ్ కోఆర్డినేటర్‌గా జగదేవ్‌పూర్‌కు చెందిన కొత్త రాహుల్‌రెడ్డి నియమితులయ్యారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం పలు రాష్ట్రాలకు ఏఐసీసీ వార్ రూమ్ కో ఆర్డినేటర్లను ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రానికి జగదేవ్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ యూత్ నాయకుడు రాహుల్‌రెడ్డిని నియమించింది. 2024 ఎన్నికలు ముగిసే వరకు ఆయన బాధ్యతలు నిర్వహిస్తారని కాంగ్రెస్ ప్రొఫెషనల్ వింగ్ చైర్మన్ ప్రవీణ్‌చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మంతో పీసీసీ వార్ రూమ్ కో ఆర్డినేటర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాహుల్ రెడ్డిని గురువారం యువజన కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు భానుప్రకాష్‌రావు, మండల సీనియర్ యూత్ నాయకులు శాలువా కప్పి సత్కరించారు.

ఆలయ ఉద్యోగికి సన్మానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పర్యవేక్షకుడిగా పని చేస్తున్న నీల చంద్రశేఖర్‌ను డిప్యూటేషన్‌పై కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి బదిలీ చేశారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ఈవో బాలాజీ గురువారం రిలీవింగ్ ఆర్డర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు, అర్చకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

ఘనంగా రంజాన్

రంజాన్ పండగను ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లో, ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల ఉపవాసం ఉండి రంజాన్ చివరి రోజు ముస్లిం మతపెద్దల సందేశం శ్రద్ధగా విని ఒకరినొకరు అలయ్ బలయ్ చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పండగ శుభాకాంక్షలు తెలిపారు. నిరుపేదలకు ఖీర్, పండ్లను పంచిపెట్టారు.



హుస్నాబాద్ పట్టణంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చేర్యాలలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి



కుకునూరుపల్లిలో శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



దుబ్బాకలో సామూహిక ప్రార్థనలు



అల్వాలలో ముస్లింలతో ఎంపీపీ సాయిలు



మద్దూరులో ..



కొమురవెల్లి(సిద్దిపేట): అయినాపూర్‌లో..



చిన్నకోడూరులో..



వర్గల్(గజ్వేల్): నెంటూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు



గజ్వేల్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

పెద్దమ్మ ఉత్సవాలకు రావాలని ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న లింగాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగాపూర్ శ్రీపెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణ ఉత్సవాలకు రావాలంటూ కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక గురువారం అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ నుంచి బీసీ బిడ్డగా తనను ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. బీజేపీ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

ఘనంగా ఆలిండియా కిసాన్ సభ

జెండా ఆవిష్కరణ



ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకుడు కనకాచారి



కొమురవెల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న బద్దిపడగ కృష్ణారెడ్డి

కొండపాక(గజ్వేల్): మండలంలోని విశ్వనాథపల్లి, రవీంద్రనగర్ గ్రామ పంచాయతీ వద్ద ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కనకాచారి మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఏఐకేఎస్ ఉద్యమించిందన్నారు. 1936 ఏప్రిల్ 11 ఆలిండియా కిసాన్ సభ ఆవిర్భవించిందన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేసేలా కేంద్రంలో మోదీ సర్కార్ తెచ్చిన నల్లచట్టాలపై ఏఐకేఎస్ చేసిన పోరాటాలతో వెనక్కి తీసుకుందన్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అమ్ముల బాల్‌నర్సయ్య, గొడుగు రాములు, కెమ్మసారం కనకయ్య, గొడుగు నారాయణ, భిక్షపతి, కృష్ణారెడ్డి, సత్తిరెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై నిరంతర పోరాటం

కొమురవెల్లి(సిద్దిపేట): రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని రైతు సంఘం మండల కార్యదర్శి బద్దిపడగ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆలిండియా కిసాన్ సభ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో ఆవిర్భవించిన ఆలిండియా కిసాన్ సభ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూనే మరోవైపు దేశంలోని జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగాపోరాటం చేసిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌తోనే మైనార్టీలకు ప్రయోజనం

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

సిద్దిపేట జోన్: మోదీ పాలనలో ముస్లింలపై దాడులు జరుగుతున్నాయని, బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఇంటిలో జరిగిన రంజాన్ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ అమలు చేసిన రిజర్వేషన్లు ఇప్పటికీ అమల్లో ఉన్నాయన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే మైనార్టీలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో భూకబ్జాలు, ఫోన్ ట్యాపింగ్, మద్యం పాలసీ కుంభకోణాలు జరిగాయని విమర్శించారు.



మైనంపల్లి హన్మంతరావును సన్మానిస్తున్న పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినట్టు ఆరోపించారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఆయన వెంట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి హరికృష్ణ, నాయకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సాయం అందజేత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట గ్రామానికి చెందిన విద్యాసాగర్ ఇటీవల హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువులో పడి మృతి చెందాడు. గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన విద్యుత్ శాఖ ఉద్యోగులు రూ.1.30 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. రూ.లక్ష కుమార్తె పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

◆ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందజేత



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట లయన్స్ భవన్‌లో గురువారం లోహిత్‌సాయి హాస్పిటల్, మ్యాన్ కైండ్ ఫార్మా సంయుక్త ఆధ్వర్యంలో 54 మంది అభయ జ్యోతి మనోవికాస కేంద్రం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, లంచ్ బాక్స్, వాటర్ బాటిల్స్, నోట్, డ్రాయింగ్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లోహిత్‌సాయి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ భాస్కర్, మ్యాన్ కైండ్ ప్రతినిధులు తిరుమలేష్, వినయ్, అభయ జ్యోతి వ్యవస్థాపకులు జోజి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు గంప రమేష్, సుభాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ సెల్‌ఫోన్ అప్పగింత



మద్దూరు(హుస్నాబాద్): సెల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి పోలీస్ అధికారులు తిరిగి అందజేశారు. మండల పరిధిలోని లద్నూర్ గ్రామానికి చెందిన మట్ట ఆనంద్ రెడ్డి మూడు నెలల క్రితం లద్నూరు నుంచి చేర్యాల వెళ్తుండగా సెల్ ఫోన్ పొగొట్టుకున్నాడు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ గుర్తించి ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఆనంద్‌రెడ్డికి ఏఎస్‌ఐ జగదీష్ అందజేశారు.

◆ దుర్గమ్మతల్లి గుడికి విరాళం



అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలో నిర్మిస్తున్న దుర్గమ్మతల్లి ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు ఇస్తున్నారు. గురువారం హైదరాబాద్‌లో స్థిరపడిన మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన చింతల సురేందర్‌రెడ్డి తన తండ్రి ఆదిరెడ్డి జ్ఞాపకార్థం రూ.25,116 విరాళంగా అందజేశారు. సురేందర్ రెడ్డి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, నాయకులు చింతల మల్లారెడ్డి, ఎల్లయ్య, జాగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు కాంగ్రెస్ నాయకుల సమావేశం

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్ పార్టీ కొండపాక, కుకునూరుపల్లి మండలాల ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం గజ్వేల్‌లోని ప్రజ్ఞా గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా నిర్వహించే సమావేశానికి ఎన్నికల నిర్వహణ ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి దామోదర రాజనర్సింహ, అభ్యర్థి నీలం మధు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి హాజరవుతారన్నారు.

◆ డాక్టర్ హానీమన్‌కు నివాళి

సిద్దిపేటకమాన్: హోమియోపతి వైద్య విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన డాక్టర్ ఫ్రెడ్రిక్ శామ్యూల్ హానీమన్ జయంతిని సిద్దిపేటలో నిర్వహించారు. బుధవారం రాత్రి పట్టణంలో హోమియోపతి వైద్యుడు దేవేందర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి, డాక్టర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

◆ బృహత్కార్యం.. గోటి తలంబ్రాల దీక్ష

గజ్వేల్‌రూరల్: భద్రాచల శ్రీసీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే తలంబ్రాలను సిద్ధం చేసే బృహత్కార్యంలో భాగస్వాములవడం సంతోషంగా ఉందని కిరాణా వర్తక సంఘం సభ్యులు పేర్కొన్నారు. శ్రీరామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో గురువారం గోటి తలంబ్రాల దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ధి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తత్వవేత్త పూలే

ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: వివక్ష లేని సమానత్వ సమాజం కోసం జీవితాంతం శ్రమించిన సామాజిక తత్వవేత్త జ్యోతిరావు పూలే అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కొనియాడారు. గురువారం తన నివాసంలో పార్టీ ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనుషులంతా అన్ని రంగాల్లో సమానత్వంతో జీవించాలని, ఆధిపత్య విలువలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. పూలే ఆశయాలకు అనుగుణంగా కేసీఆర్ పాలన కొనసాగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సుడా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు రాజనర్స్, రవీందర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సాయిరాం పాల్గొన్నారు.

హుస్నాబాద్: సమసమాజ స్థాపన కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ బలహీన వర్గాలు, మహిళలు చదువుకొని ఉన్నతంగా ఎదగాలని జ్యోతిరావు పూలే ఆకాంక్షించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు నళినీదేవి, బోజు రమాదేవి, పెరుక భాగ్యరెడ్డి, దొడ్డి శ్రీనివాస్, బొల్లి కల్పన, వాల సుప్రజ పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని బెజ్జంకిలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఉపాధ్యాయులు రామంచ రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అక్కరవేణి పోచయ్య, కచ్చు రాజయ్య పాల్గొన్నారు.

పూలే ఆశయాలు స్ఫూర్తిదాయకం

కోహెడ(హుస్నాబాద్): మహాత్మ జోతిరావు పూలే ఆశయాలు స్ఫూర్తిదాయకమని మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ రాగుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం అంబేద్కర్ చౌరస్తాలో జోతిరావు పూలే 197వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో జ్యోతిరావు పూలే 197వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పూలే ఆశయాలను కొనసాగించాలి

మద్దూరు(హుస్నాబాద్): జ్యోతిరావు పూలే ఆశయాలను ప్రతీ ఒక్కరూ కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు దుబ్బుడు వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం దూళ్మిట్ట మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే 197వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.



జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో..

హుస్నాబాద్: పేదల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన జ్యోతిరావు పూలే ఆశయాలను సాగిద్దామని జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జ్యోతిరావు పూలే 197వ జయంతి కార్యక్రమాన్ని గురువారం దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. దేశంలో మనువాద సిద్ధాంతం అంటరానితనాన్ని పెంపొందించిందన్నారు. ప్రజల్లో సామాజిక అసమానతలకు బ్రాహ్మణీయ భావజాలామే ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

గజ్వేల్‌రూరల్: అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. జ్యోతిరావు పూలే 197వ జయంతిని పురస్కరించుకొని గురువారం గజ్వేల్‌లో వేర్వేరుగా ఆయన చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దిగువ కులాలకు సమాన హక్కులు పొందటానికి సత్యశోధక్ సమాజ్ సంస్థను ఏర్పాటు చేసి, సామాజిక సంస్కరణ ఉద్యమంలో దేశంలోనే మొదటి వ్యక్తిగా పరిగణింపబడ్డారన్నారు.

వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో..

కొమురవెల్లి(సిద్దిపేట): జ్యోతిరావు పూలే జయంతిని మండల కేంద్రంలో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ వేర్వేరుగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బాల కిషన్, రవీందర్ నవీన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు..

వర్గల్(గజ్వేల్): వర్గల్ పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం మహాత్మా జ్యోతిబా పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా పూలే గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు, వీపీ గోవిందరావు మాట్లాడారు. మహిళా విద్యకు పాటుపడ్డారని, సాంఘిక దురాచారాలు రూపుమాపేందుకు, కులవివక్ష పారదోలేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ టు ప్రిన్సిపాల్ (ఏటీపీ) భాగ్యలక్ష్మి, డిప్యూటీ వార్డెన్ (డీడబ్ల్యూ) లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. పూలే బాలికా విద్య, మహిళల అభ్యున్నతికి కృషి చేశారన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మహాత్మా జ్యోతి రావు పూలే జయంతిని గురువారం చిన్నకోడూరులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు జంగిటి శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పూలే కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర పాల్గొన్నారు.

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో జ్యోతిరావ పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: జిల్లా కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్, దళిత సంఘర్షణ సమితి నాయకుడు రమేష్, బీసీ సెల్ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఎస్టీయూ, బీడీఎస్‌ఎఫ్, యూటీఎఫ్, బహుజన్ సమాజ్ పార్టీ, పీడీఎస్‌యూ, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వర్గల్ పూలే గురుకులంలో ప్రసంగిస్తున్న ఆర్సీఓ ప్రభాకర్‌రావు



హుస్నాబాద్‌లో నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు